2CTR1:2CTR1.qxd 10/1/2026 11:50 PM Page 1




# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026


## చిత్తూరు మున్సిపాల్టీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

### - నేడు జిల్లా స్థాయి అవార్డులు ప్రదానం

చిత్తూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త:

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లాలో విశేషంగా స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించిన వారిని గుర్తించి ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు-2026 ప్రదానం చేయనుంది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జడ్పీ సమావేశభవనంలో జిల్లా స్థాయిలో విశేషంగా స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించిన 64 మందికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ముక్కలత్తూరు, కార్వేటినగరం, దండికుప్పం, పాతగుంట గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, పంచాయతీల కార్యదర్శులు పి.కిరణ్‌కుమార్, నాగరత్నమ్మ, బిఆర్ రవినాయక్, ఎస్.దివ్యవాణిలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు బహుకరించనున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 64 మంది స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు ఎంపికయ్యారు. వీరందరికీ సైతం కలెక్టర్ సుమిత్‌కుమార్ అవార్డులు అందించనున్నారు.

కన్నుల పండువగా

## ముగిసిన పోలేరమ్మ జాతర

### - ఊరేగింపులో పాల్గొన్న లక్షలాదిమంది భక్తులు



బాలాయపల్లి, అక్టోబర్ 1 ప్రభాతవార్త :

గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర కన్నుల పండుగ ముగిసింది. అమ్మవారి బ్రహ్మోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా హారతులు ఇచ్చే కొబ్బరి కాయలు కొట్టి మొక్కలు తీసుకున్నారు. బుధవారం అమ్మవారి నిలుపు నుండి నిమజ్జనం వరకు లక్షల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా ప్రతి సంవత్సరం కన్నా ఈ సంవత్సరం భక్తులు అదే సంఖ్యలో పాల్గొన్న ట్లు అంచనా వేశారు. పట్టణంలోని అన్ని వీధులు భక్తులతో నిండిపోయింది. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా మహిళలు అమ్మవారిని నమ్ముతారు. బుధవారం రాత్రి 7 గంటలకు కుమ్మరి వీధిలో అమ్మవారిని తయారు చేసి ఇక్కడ నుండి అత్తవారిల్లుగా భావించే జీవురాల వీధిలో అమ్మవారిని పెట్టి అలంకరిస్తారు. కుమ్మర వీధిలో అమ్మవారికి కళ్ళు పెట్టకుండా అత్త ఇంటికి తీసుకొని వెళ్తారు. అమ్మవారిని అలంకరించిన తర్వాత భక్తుల దర్శనార్థం బజారు వీధిలోని గుడి వద్ద ఉంచి గురువారం సాయంత్రం నిరూపణ చేస్తారు. అమ్మవారి ఊరేగింపులో రాజ వీధి, కాసిపేట, శివాలయం వీధుల్లో అమ్మవారిని చివరి చూపు చూసేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఊరేగింపులో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పి సుబ్బరాయుడు, ఏ ఎస్ పి రవి మనోహర్ ఆచారి, డీఎస్పీ చెంచు బాబు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి పర్యవేక్షించారు.

# మేయర్ టిక్కెట్టు ఆశపై నీళ్లు

### పల్లా శ్రీనివాస్ ప్రకటనతో అలజడి- ఆగమ్యగోచరంగా తిరుపతి టిడిపి నేతలు -వైసిపి నుండి వచ్చిన వారికి మొండిచేయి



ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కొందరు నాయకుల రాజకీయ పరిస్థితి 'రెండింటికీ చెడ్డ రేవడ్డి అన్నట్టుగా మారిందన్న చర్చ నగరంలో జోరుగా సాగుతోంది. ఇతర పార్టీల నుండి టిడిపిలోకి వచ్చిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇవ్వబోమని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం తిరుపతిలో స్పష్టం చేయడంతో మేయర్ టికెట్ ఆశిస్తున్న పలువురు నేతల్లో కలకలం రేపింది. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన భూమన అభినయ్ రెడ్డి డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీకి డిప్యూటీ మేయర్ ఎన్నిక 2025జరిగింది. ఆ సమయంలో వైసిపి కార్పొరేటర్లు అన్నా అనితా యాదవ్, నరసింహ ఆచారి తదితరులు కూటమికి దగ్గరయ్యారు. తమతో బాటు 25 మందికి పైగా కార్పొరేటర్లను కూటమి వైపు తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అనితా యాదవ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆశీస్సులతో టిడిపిలో చేరగా, నరసింహ ఆచారి జనసేన నేత ఎన్వీ ప్రసాద్ మద్దతుతో డిప్యూటీ మేయర్ పదవిని ఆశించారు. అయితే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ పార్టీ ఏకైక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణకు బిఫారం ఇవ్వడంతో వారి ఆశలు నెరవేరలేదు. తర్వాత అన్నా అనితా యాదవ్‌కు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పదవి లభించింది. ఇప్పుడు జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ టికెట్ కోసం ఆమె తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నరసింహ ఆచారి కూడా బిసిలకు మేయర్ పదవి రిజర్వ్ అయితే తనకు అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే తొలినుండి టిడిపిలో కొనసాగుతున్న జి. నరసింహ యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి యాదవ్ తదితరులు కూడా మేయర్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీ కోసం మొదటి నుండి పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వకూడదని వారు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో పల్లా శ్రీనివాసరావు చేసిన ప్రకటనతో వైసిపి నుండి టిడిపిలోకి వచ్చిన కార్పొరేటర్లతో బాటు మేయర్ టికెట్ ఆశిస్తున్న అనితా యాదవ్, నరసింహ ఆచారి వర్గాల్లోనూ నిరాశ నెలకొన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి కూడా మేయర్ రేసులో ఉన్నారు. టిడిపిలో ఉంటే మేయర్ టికెట్ దక్కే అవకాశం లేదని భావించిన కొందరు నేతలు జనసేన వైపు దృష్టి సారించినప్పటికీ అక్కడ కూడా ఆశించిన ఫలితం కనిపించలేదన్న చర్చ జరుగుతోంది. విద్యా సంస్థల అధిపతి ప్రణీత్ జనసేన టికెట్ కోసం ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసినప్పటికీ అనుకూల ఫలితం రాలేదని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా ఊక విజయకుమార్ టిడిపికి రాజీనామా చేసి జనసేనలో టికెట్ కోసం ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నం కూడా ఆదిలోనే నిలిచిపోయిందన్న చర్చ ఉంది. దీంతో వైసిపి నుండి టిడిపిలోకి వచ్చిన కొందరు నేతలకు టికెట్‌పై అనిశ్చితి, టిడిపిలో పదవులు అనుభవించి జనసేన వైపు వెళ్లాలని ప్రయత్నించిన కొందరికి అక్కడా అవకాశం లేకపోవడం తిరుపతి రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల వేళ 'రెండు వైపులా అవకాశం లేకుండా పోయిందా?" అంటూ నగర రాజకీయ వర్గాల్లో వేడి చర్చ సాగుతోంది.



## శోకసంద్రంలో ఏకం క్షేత్రం..

### లక్ష మందికి పైగా భక్తులు

### ప్రభుత్వ లాంఛనాలతో శ్రీ కల్కి భగవాన్ అంత్యక్రియలు



వరదయ్యపాలెం, అక్టోబర్ 1 ప్రభాతవార్త

మానవ రూపంలో దేవుడిగా కోట్లాది మంది భక్తులు ఆరాధించే శ్రీ కల్కి భగవాన్ ఇక లేరు అనే వార్త వినగానే దేశం నలుమూలల నుండి, చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు వరదయ్యపాళెం మండలం ఏకం క్షేత్రానికి తరలివచ్చారు. ఇప్పటివరకు లక్ష మందికి పైగా భక్తులు.. ఆయన పార్థివదేహాన్ని దర్శించుకున్నారు. శుక్రవారం (2వ తేదీ) మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు.. జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

**- వీఐపీల సందర్శన.. నివాళుల వెల్లువ:**

కల్కి భగవాన్ పార్థివ దేహాన్ని దర్శించుకుని నివాళులు అర్పించిన వారిలో తమిళనాడు మాజీ ఫైనాన్స్ మినిస్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి సర్వన్ సింగ్, శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ సాయి ప్రసాద్, విహెచ్‌పి చీఫ్ రాఘవులు, వైసీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జ్ నూకతోటి రాజేష్ తదితర ప్రముఖులు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం, 2వ తేదీ మధ్యాహ్నం 2:00 గం. నుండి 6:00 గం. వరకు బత్తలవల్లంలోని ఏకం క్షేత్రంలో నిర్వహించనున్నారు. స్థానిక నాయకులు దయాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, హరి నాయుడు, బాపన తిలక్ బాబు, బొప్పన రమేష్, శివ యాదవ్, గిరి రెడ్డి, హరి రెడ్డి, సీనా రెడ్డి, ఉజ్వల రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి వరుణ స్వర యాగం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాలతో దుర్భిక్ష నివారణకు వరుణ స్వర యాగం నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఇఓబికె వెంకటేశులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఎన్‌నోనిన్ ప్రభావతం ఆంధ్ర రాష్ట్రంపై అధికంగా ఉండటంతో వరుణుని కరుణ కోసం దేవాదాయశాఖ ఆలయాల్లో కార్యక్రమాల నిర్వహణకు ఆదేశించినట్లు వివరించారు. ఎంతటి కఠినపై హృదయమైనా 'సంగీతం'తో కరుగుతుందని పెద్దలు చెబుతారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ చక్కటి కార్యక్రమాలను రూపొందించి 5రోజుల పాటు నిర్వహించుటకు ఆదేశించారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని, రైతులు సిరిసందలతో, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వర్షాల కోసం వరుణ యాగం నిర్వహించామని ప్రస్తుతం మరో ప్రయోగం మన పురాతన పద్ధతిలో నిర్వహించుటకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరుణ దేవుని కరుణ కలిగే విధంగా వివిధ రాగాలను ఆదారంగా చేసుకొని దేవస్థానంలోని వాద్య కళాకారులచే నాదస్వరం, డోలు, శ్రుతి,తాళ సమన్వయంతో ప్రత్యేక సంగీత సేవతో వరుణుని ఆకట్టుకొనుటకు రూపొందించినట్లు వివరించారు. ఈ సంగీత సేవ ద్వారా భక్తులలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించటంతో పాటు వరుణ దేవుని అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురవటానికి వేసవి తాపం నుంచి ప్రజల్ని కాపాడుటకు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## వరసిద్దుని సన్నిధిలో ఇస్రో మాజీ చైర్మన్



కాణిపాకం, అక్టోబర్ 1 ప్రభాతవార్త:

భారత అంతరిక్ష శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్ మరియు అంతరిక్ష పరిశోదన కమిటీ సభ్యుడు ఏఎస్.కిరణ్‌కుమార్ గురువారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ కల్కి భగవాన్ మహాసమాధి



"ఏకత్వమే మానవత్వానికి మూలం"

ఆధ్యాత్మికత, మానవత్వం, దైవత్వం, ప్రేమ, శాంతి, మరియు ఏకత్వం వైపుకు ప్రజలను నడిపించేందుకు తమ జీవితమంతా ధ్యానం, భక్తి అనుగ్రహ మార్గాలలో కోట్లాది మందిని నడిపించిన **శ్రీ కల్కి భగవాన్ గారిని** వారు చేసిన ఎనలేని మహిమలను తలచుకుంటూ హృదయపూర్వకమైన నివాళులు అర్పిస్తున్నాము. వారి మహాసమాధి ద్వారా వారు ఎప్పుడూ భక్తులకు అనుగ్రహాన్ని అందిస్తూ ఉండాలని కోరుతూ... శ్రీ కల్కి భగవాన్ భక్త బృందం

ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం గ్రామంలోని ఏకం ఆశ్రమం నందు నేడు శుక్రవారం సాయంత్రం 3.00 గంటల నుండి 6.00 గంటల వరకు అంతిమయాత్ర నిర్వహించబడుతుంది.

- భక్త బృందం

Prajit Foundation Pvt. Ltd., Varadaiahpalem.


## గణనాధునికి వైభవంగా పూలంగిసేవ



కాణిపాకం, అక్టోబర్ 1 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గణనాధునికి పూలంగిసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కీ॥శే॥ రాజమాణిక్యం నాయుడు అండ్ సన్స్, వేలూరు,శ్రీ కె.రాధాకృష్ణన్, కాణిపాకం ఉభయదారులుగా వ్యవహరించారు. వారు పగలు మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకపూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తిరిగి రాత్రి స్వామివారికి పూలంగిసేవను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలోని గర్భాలయం, అంత్రాలయం, మహామండపంలను వివిధరకాల పరిమళ పుష్పాలతో విశేషాలంకరణ చేపట్టారు. ఇదిలా వుండగా సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాధుని ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకస్వాములు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊయలలో వుంచి ఊంజల్‌సేవను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణికుమార్ శర్మ, ఏఈఓలు ధనపాల్, హరిమాధవరెడ్డి, రవీంద్రబాబు,ప్రసాద్, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు,రవిలతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు,అర్చకులు, వేదపండితులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**ఘనంగా ప్రాకారోత్సవం**

కాణిపాకం ఆలయంలో గురువారం రాత్రి పూలంగిసేవ అనంతరం ప్రాకారోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్లకు పూలంగిసేవను నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రధాన ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేయించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు, ఉభయదారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ తిరుపతే లక్ష్యంగా ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి



తిరుపతి కార్పొరేషన్, అక్టోబరు 1 ప్రభాతవార్త:

తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం వినాయక సాగర్ వద్ద భారీ శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే,కమిషనర్, స్థానిక నాయకులు, నగరపాలక సిబ్బందితో కలిసి వినాయక సాగర్ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతిని స్వచ్ఛ తిరుపతిగా, సుందర తిరుపతిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కమిషనర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17వరకు నగరంలోని 50 డివిజన్లలో శ్రమదాన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, గ్రీనరీ అండ్ బ్యూటీఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, ఎస్‌విబిసి చైర్మన్ శ్రీధర్‌వర్మ, నరసింహ యాదవ్, జెబీ శ్రీనివాసులు, రుద్రకోటి సదాశివం, ఆర్ సి మునికృష్ణ, మహేష్ యాదవ్, ఏపీయూ ఎఫ్ ఐడిసి డైరెక్టర్ చందన స్రవంతి సిబ్బంది పాల్గొన్నారు.

## సాంస్కృతిక కళాకారుల్ని ఆదుకోవాలి

శాంతిపురం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



మండలంలో ఉన్న సాంస్కృతిక కళాకారులను ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కళాకారులు గురువారం ఎంపిడిఒ ఎపిఆర్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కళాకారుల మందిరం నిర్మించడంతో పాటు వాద్య పరికరాలు ఉచితంగా అందించాలన్నారు. యాభై ఏళ్లకు పెన్షన్లు అందించడంతో పాటు ప్రభుత్వం తరపున కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ స్పందించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మునెప్ప, గోవిందప్ప, రాజప్ప, రామచంద్ర, కృష్ణమూర్తి, సోము, నాగరాజు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబు చొరవ

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**

రామకుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



మహిళల ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు చొరవ చూపుతున్నారని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం బందార్లపల్లి గ్రామంలో మేఘా సంస్థ ద్వారా కుట్టుశిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, ధృవపత్రాలను ఎమ్మెల్సీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పంలో పేదరికం లేని సమాజం చూడాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం తరపున మహిళలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిఎం పిఎ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు గుర్రప్ప, వెంకటరామగౌడు, హరీష్, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజు, వెంకటాచలం, బాలకృష్ణ, మంజునాథ్, పెరుమాళ్ పాల్గొన్నారు.

## పల్లెపండగలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రామకుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని యానాది కాలనీలో పది లక్షలతో సిసి రోడ్డు నిర్మాణంకు నేతలు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కో ఇన్‌చార్జ్ రవిరెడ్డి, నవీన్, నేతలు సతీష్, బాలరేజు, హరి, భాస్కర్, సుబ్రమణ్యం, రవి, మహేష్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్**

పెనుమూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త:

పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుని పని చేస్తోందని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ గురువారం పెనుమూరు మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని చార్వకానిపల్లిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం బిసీ కాలనీలో సిసి రోడ్ శంకుస్థాపన, స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరిగోడను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రంను విధ్వంసం చేసిందని, ఆర్థికంగా అన్ని రంగాలను నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నేత లోకనాథ్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దినేని రుద్రయ్యనాయుడు, జిల్లా పార్టీ కార్యదర్శి వీరపల్లి హరిబాబునాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పెద్దినేని కృష్ణమూర్తి నాయుడు, నాయకులు పట్నం పరమేశ్వర్‌రెడ్డి, తలారి రెడ్డప్ప, మనోహర్‌రెడ్డి, పంగులూరు కిశోర్‌నాయుడు, చల్లపాళెం గుర్రప్పనాయుడు, తులసీనాయుడు, గంగాధరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో గో గ్రేటర్ - ఫేజ్ 2 ప్రారంభం

**- 8 టెనెట్ల ఆధారంగా సంస్థాగత సంస్కృతిని బలోపేతం చేయడమే లక్ష్యం**

తిరుపతి హెల్త్, అక్టోబర్ 1, ప్రభాతవార్త




ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, తిరుపతిలో గో గ్రేటర్ - ఫేజ్ 2 మూవ్‌మెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్‌కు చెందిన భారతదేశంలోని అన్ని యూనిట్లలో సంస్థ విలువలను మరింత బలోపేతం చేయడం, ఉద్యోగుల్లో అవగాహన పెంపొందించడం, విలువల ఆధారిత కార్యసంస్కృతిని అభివృద్ధి చేయడం, సమిష్టి కృషిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డా. సునంద కుమార్ రెడ్డి – చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్, డా. శ్రీధర్ ముని – చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, డా. ఎస్.వి. ప్రసాద్ – చీఫ్ జనరల్ సర్జన్, డా. (మేజర్) సుభాష్ – చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు. ముఖ్య అతిథి ఇతర ప్రముఖుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన నిర్వహించిన అనంతరం గో గ్రేటర్ – ఫేజ్ 2ను అధికారికంగా ఆవిష్కరించారు. గో గ్రేటర్ – ఫేజ్ 2లో భాగంగా సంస్థలోని ప్రతి ఉద్యోగి తమ రోజువారీ విధుల్లో అనుసరించాల్సిన 8 ప్రధాన టెనెట్లను పరిచయం చేసి, వాటిపై అవగాహన కల్పించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని యూనిట్లలో ఒకే విధమైన విలువల ఆధారిత సంస్కృతిని పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. గో గ్రేటర్ – ఫేజ్ 2 ప్రారంభోత్సవంలో భాగంగా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ చేపడుతున్న సిఎస్ఆర్ కార్యక్రమం పెడల్ టూ ప్రోగ్రెస్ – 20 సైకిల్ ఫర్ ఎడ్యుకేషన్‌ను కూడా ముఖ్య అతిథి డా. నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. వేదుల చెరువు ఎస్‌టి కాలనీకి చెందిన విద్యార్థులు గుత్తివారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారికి 20 సైకిళ్లను అందించే కార్యక్రమాన్ని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ చేపట్టింది. విద్యార్థులు తమ విద్యను నిరంతరంగా కొనసాగించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించడం, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావడానికి ప్రోత్సహించడం, విద్య పట్ల వారిలో మరింత ఉత్సాహాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా, రాబోయే ఒక నెలలో 20 సైకిళ్లను విద్యార్థులకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక అడుగు ముందుకు ఒక అడుగు పైకి కలిసి మరింత ఉన్నతంగా – గో గ్రేటర్ టూగెధర్ అనే స్ఫూర్తితో గో గ్రేటర్ – ఫేజ్ 2 ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతపై డీఈఓ ప్రత్యేక దృష్టి

తిరుపతి విద్య అక్టోబర్ 1 ప్రభాత వార్త



పాఠశాలల్లో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో భాగంగా సరఫరా చేసిన టాయిలెట్ క్లీనింగ్ సామగ్రిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలలకు అవసరమైన మేరకు క్లీనింగ్ మెటీరియల్ అందుబాటులో ఉంచినందున, వాటిని నిల్వ ఉంచకుండా మరుగుదొడ్ల పరిశుభ్రతకు ఉపయోగించాలని డీఈఓ స్పష్టం చేశారు. మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మనబడి–మన భవిష్యత్తు (ఎంబీఎంబీ) నిధులతో నిర్మాణ పనులు పూర్తయి, కేవలం పెయింటింగ్ వంటి స్వల్ప పనులు మాత్రమే మిగిలిన పాఠశాలలు, తరగతి గదులు, మరుగుదొడ్లను కూడా విద్యార్థుల వినియోగానికి తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆదేశాల అమలును పరిశీలించేందుకు డీఈఓ గురువారం పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఆర్సీ కేంద్రంగా ఉన్న ఈ పాఠశాలలో పరిధిలోని పాఠశాలలకు పంపిణీ చేసేందుకు నిల్వ ఉంచిన టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు అందుబాటులో ఉండటంతో పాటు అవి పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించేలా అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని డీఈఓ కె.వి.ఎన్. కుమార్ స్పష్టం చేశారు.

## యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కుప్పం ఎస్పీ బి.హేమంత్ సూచించారు. గురువారం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై ఎస్పీ అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం, కుటుంబ జీవితం తీవ్రంగా ప్రభావితం అవుతుందన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మకతపై మక్కువ చూపాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ నారాయణమూర్తి, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, అధ్యక్షుడు సెల్వం, సభ్యుడు జయరాంనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెన్షన్ల పెంపు ఘనత సిఎం చంద్రబాబుదే

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ల నగదు పెంచి ప్రతినెలా ఒకటోతేదీ లేదా అంతకంటే ముందే అందిస్తున్న ఘనత సిఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ఆయన రామచంద్రారోడ్, వజ్రవేలుశెట్టి వీధి తదితర ప్రాంతాల్లో లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అన్నారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు సైతం సిఎం ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న సిఎం చంద్రబాబును మరింత ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ సోమశేఖర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, మాజీ సర్పంచ్ గోపీనాథ్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్,ఎంఆర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం**

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి కలిగిస్తామని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం మల్లానూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులతో పాటు గ్రామీణ ప్రాంతాలను సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తున్నారు. పి4 కార్యక్రమంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో కడ పి.డి. వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర,కనీసవేతనాలమండలి సభ్యుడు శరవణ, ఎస్వో నరసింహనాయుడు, ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన యువతతో వికసిత్‌భారత్‌కు పునాది

**- బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్**

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త




ఆరోగ్యవంతమైన యువతతో వికసిత్ భారత్‌కు బలమైన పునాది ఏర్పడుతుందని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. గురువారం కుప్పం ఇంజనీరింగ్, కుప్పం డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ల అధ్వర్యంలో నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్, మైహెల్త్ మైప్రైడ్ అనే కార్యక్రమంను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు నడక కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, హెచ్ఒడి మాధవన్, పిఒ గంగాధర్, అరుణ్‌కుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరెకరాల ప్రభుత్వభూమి కబ్జాను అడ్డుకున్న అధికారులు

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



కుప్పం మండలం కృష్ణదాసనపల్లి పంచాయతీ వరమనూరు గ్రామం వద్ద సుమారు ఆరు ఎకరాల ప్రభుత్వభూమి కబ్జాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తహశీల్దార్ రమేష్‌బాబు ఆదేశాలతో విఆర్వో, ఇతర అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న షెడ్‌ను జెసిబి సాయంతో కూలే్చశారు. అనంతరం ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఈ విషయంగా తహశీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఈ ప్రభుత్వభూమిని ఓ మహిళా నేత ఆక్రమించినట్లు అధికార పార్టీ వర్గాలే గుసగుసలాడుతున్నట్లు

## వన్‌స్టాప్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ఏరియా ఆస్పత్రి ఆవరణలో వన్‌స్టాప్ సెంటర్ నిర్మాణంకు గురువారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, ఐసిడిఎస్ అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులకై మహిళల ఆందోళన

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త

కుప్పం నుంచి పలమనేరుకు వెళ్లేందుకు బస్సులు సకాలంలో రాకపోవడంతో కుప్పం ఆర్టిసి డిపోలో పలువురు మహిళలు ఆందోళన నిర్వహించారు. గంటలు తరబడి బస్సుల కోసం వేచి ఉన్న బస్సులు రాకపోవడంతో తాము తీవ్ర అవస్థలు పడుతున్నట్లు ఆర్టిసి అధికారుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఎటిఎంలో చోరీకి యత్నం

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి తంబిగానిపల్లి వద్ద ఉన్న ఓ ఎటిఎం సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించినట్లు తెలిసింది. అయితే ఎటిఎం లాకర్ తెరచుకోలేదని అంతలోపే స్థానికులు గమనించి కేకలు వేయడంతో గుర్తు తెలియని దుండగులు పరారైనట్లు సమాచారం.

## అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**- టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్**

శాంతిపురం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. గురువారం కొలమడుగు, శివరాంపురం, అబకలదొడ్డి పంచాయతీల్లో జరిగిన తెదేపా సమన్వయ కమిటీ సమావేశాల్లో వారు మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలు ప్రజలకు వివరించాలని సూచించారు. నేతలు, కార్యకర్తలు అసంతృప్తిని పక్కనపెట్టి సమన్వయంతో పనిచేసి సత్తా చాటాలన్నారు. తెదేపా కుటుంబీకుల మధ్య కలహాలు సృష్టించేందుకు ఓ పార్టీ పనిచేస్తుందని అలాంటి వాటిని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, గోపాల్, మణి, గిరిధర్, రాజేంద్ర, చంద్ర, బాలు, దాము, బాలమురుగన్, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## వృద్దులకు అండగా నిలవాలి

చిత్తూరురూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త:




ప్రపంచ వయోవృద్దుల దినోత్సవం సందర్భంగా మై భారత్ ఆద్వర్యంలో సపోర్టు నిరాశ్రయుల వసతి గృహంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి వృదులకు పండ్లు పంపిణీ చేశారు. సపోర్టు సంస్థ అధ్యక్షుడు జోసఫ్ మాట్లాడుతూ వృద్దులను ప్రేమ, ఆప్యాయతలతో చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వారి ఆరోగ్య పరిరక్షణకు వైద్యశిబిరాలు నిర్వహించడంతో పాటు యోగా సాధన చేయించాలని సూచించారు. వృద్దుల నైపుణ్యాలను ప్రోత్సహించేలా చేతివృత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం వుందన్నారు. మైభారత్ ఆఫీస్ అసిస్టెంట్ రాజకుమారి మాట్లాడుతూ వృద్ధులకు ప్రేమ, భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మైభారత్ వాలంటీర్ మహేష్, సపోర్టు సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాప్రాణదానం

**- జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డా. తేజోమూర్తి**

చిత్తూరురూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త:



రక్తదానం మహా ప్రాణదానంతో సమానమని జిల్లా రెడ‌క్రాస్ ఛైర్మన్ డా.తేజోమూర్తి తెలిపారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంను డా. తేజోమూర్తి రెడ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ, సేవా, మానవతా దృక్పదాన్ని అలవర్చుకోవాలని, దూమపానం, మద్యపానం, మత్తుపదార్థాలు వంటి దురలవాట్లకు దూరంగా వుండి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కాగా శిబిరంలో 30మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, విద్యార్థులకు రెడ్‌క్రాస్ ఆద్వర్యంలో ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. అలాగే జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, ఈగల్ టీం సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు రక్తదానం, ఆరోగ్యం, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి రాజగోపాల్‌నాయుడు, కార్యదర్శి సహదేవనాయుడు, మెడికల్ ఆఫీసర్ డా.విజయకుమార్, డా. సుదర్శన్, డిఎఫ్ఓ చిరంజీవి, ఈగల్ టీం సభ్యులు ఎస్ కుమార్, సుందర్, రాజశేఖర్, కళాశాల ఏవో మోహన్‌నాయుడు, ప్రిన్సిపాల్ దేవేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లో ఘనంగా పోషణ మహా

చిత్తూరురూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త:



చిత్తూరు రూరల్ మండలం పాలూరు గ్రామపంచాయతీ పాలంతోపు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ మహాకార్యక్రమంను వైభవంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని, ఆకుకూరలు,పప్పులు, చిరుదాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజు తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎన్ మోహన్‌రాజ్, మాజీ ఎంపిటిసి మేషక్, మండల రైతు సంఘ అధ్యక్షుడు సుధార్, గ్రామకమిటీ జనరల్ సెక్రటరీ వెంకటేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజరు బిందు, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాధన్ పిళ్లై, అంగన్‌వాడీ హెల్పరు పుష్ప, పిల్లల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లను పంపిణీ చేసిన షణ్ముగం

చిత్తూరురూరల్, అక్టోబరు 1 ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆదేశాల మేరకు 39వ డివిజన్‌లో చిత్తూరు భాజపా సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం సచివాలయ సిబ్బందితో కలసి పింఛన్లను పంపిణీ చేశారు. గురువారం ఉదయం డివిజన్ పరిధిలోని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తూ, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. ఎటువంటి సమస్యలు వున్నా తనకు తెలిపితే ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కూటమినాయకులు, సచివాలయ అడ్మిన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా టౌన్ బ్యాంక్ పాలకవర్గం ప్రమాణస్వీకారం

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



కుప్పం సహకార టౌన్ బ్యాంక్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ఛైర్మన్‌గా మంజునాథ్, వైస్ ఛైర్మన్ గా ఉదయ్ కుమార్, డైరెక్టర్లుగా చాంద్ ,సింధు, నవనీత బాధ్యతలు చేపట్టి ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పాలకవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు కార్యక్రమంలో పి కే యం యుడా ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, సిఎం పిఎ శ్రీకాంత్ ,రెస్కో ఛైర్మన్ ప్రతాప్, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని నాయకులు ఘనంగా సత్కరించారు. ఫోటో రైట్ అప్ : కెపిఎం 9

## మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



మండలంలోని మల్లానూరు పంచాయతీలో డ్వాక్రా సంఘాల మహిళలకు మనకోడి మన వెలుగు సంఘం కార్యక్రమంలో భాగంగా పెరటికోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టిసి వైస్ ఛైర్మన్ మునిరత్నం, పి కే యం యుడా ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, సీఎం పిఎ శ్రీకాంత్ ,టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ ,కడా సభ్యుడు రామచంద్ర,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఏడు కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు భూమిపూజ

కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త




కుప్పం పట్టణంలోని కడ కార్యాలయంపై అంతస్తులో 7.40కోట్లతో నిర్మించే అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణంకు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు భూమిపూజ చేశారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో ప్రభుత్వసేవలు, ప్రజాభద్రత, పట్టణ నిర్వహణ, ప్రభుత్వ శాఖల కార్యకలాపాల పర్యవేక్షణకు ఈ సెంటర్ నిర్మిస్తున్నారు. ఐసిసిసి సెంటర్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని వారు ఆదేశించారు. కార్యక్రమంలో సిఎం పిఎ శ్రీకాంత్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం,ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, కమీషనర్ శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్,జనసేన ఇన్‌చార్జ్ నరేష్, బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## ప్రతి గ్రామానికి రోడ్లు, మురుగునీటి కాలువలకు నిధులు : ఎమ్మెల్యే



అమ్మపాళెం గిరిజన కాలనీకి రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు

శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 1 ప్రభాతవార్త : మండలం అమ్మపాళెం గ్రామంలో గురువారం పల్లెపండగ కార్యక్రమాల్లో భాగంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సిమెంటురోడ్డు నిర్మాణానికి భూమి పూజ జరిపారు. ఓ వైపు నిరుపేదలకు పెన్షన్లు అందిస్తూ మరో వైపు పల్లెపండగను ఘనంగా నిర్వహించారు. రూ.36లక్షల అంచనాలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల రూపురేఖలు మార్చటానికి కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో పంచాయతీలకు వచ్చిన అభివృద్ధి నిధులను కరెంటు బిల్లులకు చెల్లుచేసుకున్నారన్నారు. ఇక స్థానికంగా పంచాయతీలకు సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసారు తప్ప తరువాత వారికి నిధులు లేకుండా ప్రజల నుంచి సర్పంచ్‌లు శాపనార్థాలు ఎదుర్కొంటుంటే పట్టించు కోలేదన్నారు. నేడు గ్రామాలకు సర్పంచ్‌లు లేకునా నిధులున్నాయని అభివృద్ధి పనులు సాగుతున్నా యన్నారు. నేడు ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు మురుగునీటి కాలువలకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. అభివృద్ధిలో తనతో పయనిస్తున్న మండల నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఎల్ఏ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, కామేష్ యాదవ్, బత్తిరెడ్డి, పేరం ధనంజయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో సహకార బ్యాంకుచే పెట్రోల్ బంకు



తొట్టంబేడు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలోని పీఏసీఎస్ సింగిల్ విండో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో తంగేళ్ళపాలెం పీఏసీఎస్, హెచ్.పి.సి.ఎల్. భాగస్వామ్యంతో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ పెట్రోల్ బంక్ తొట్టంబేడు మండలంలోని రామచంద్రాపురం గ్రామం (పిచ్చాటూరు రోడ్డు) వద్ద ఏర్పాటు చేయబడింది. అభివృద్ధికి పర్యాయ పదంగా నిలిచిన శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కావడం సంతోషకరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పెట్రోల్ బంక్ ద్వారా స్థానిక ప్రజలు, రైతుల ఇంధన అవసరాలు సులభంగా తీరనున్నా యని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్ పర్సన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రావెళ్ళ మునిరాజా నాయుడు, తంగేళ్ళపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, కాపుగున్నేరి పీఏసీఎస్ బ్యాంక్ ఛైర్మన్ బత్తిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జి. దశరథాచారి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, గాలి మురళి నాయుడు, కయ్యూరి దిలీప్, యువజన నాయకుడు బాలాజీరెడ్డి, తిరుపతి పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, వజ్రం కిషోర్, సులేమాన్, మునిరాజా యాదవ్, మునిరత్నం, వెంకటాచలం, బ్యాంకు సిఈఓ చిరంజీవి రెడ్డి, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నెల 3, 4 తేదీల్లో నెల్లూరులో ఐలు రాష్ట్ర మహాసభలు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త: న్యాయవాదుల రక్షణ చట్టం, లా నేస్తం నిధుల విడుదల, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి కీలక డిమాండ్ల సాధన కోసం ఈ నెల 3,4 తేదీల్లో నెల్లూరులో జరగనున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 13వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐలు నేత, ప్రముఖ న్యాయవాది కాకి చిన్న అంకయ్య పిలుపు నిచ్చారు. గురువారం శ్రీకాళహస్తిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు పట్టణంలోని కస్తూరిబా కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగం పరిరక్షణకు న్యాయవాదులు ముందుం డాల్సిన అవసరం ఉందని అన్నారు. పలు అంశాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ మహాసభలకు ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుండి అధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## శివయ్య సేవలో నిమ్మకాయల చినరాజప్ప



శ్రీకాళహస్తి,అక్టోబర్ 1 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం పెద్దాపురం శాసనసభ్యుడు నిమ్మకాయల చినరాజప్ప కుటుంబసభ్యులతో పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు ఆదేశాలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత పూజలను జరిపించుకున్న వారికి స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను తీర్థ ప్రసాదాలను ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి అందించారు. ఏర్పాట్లును ఆలయ ఇన్స్‌పెక్టర్లు వెంకటస్వామి, హరియాదవ్, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## శివయ్య సేవలో లోక్‌పాల్ సభ్యులు దర్శనం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 1 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని గురువారం లోక్‌పాల్ ఆఫ్ ఇండియా జ్యుడిషియల్ సభ్యులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదా కలిగిన జస్టిస్ రితురాజ్ అవస్థి దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాటు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలను అందించారు. కాగా, శ్రీకాళహస్తి ఆలయాన్ని గురువారం ఐఏఎస్ అధికారి విజయ్‌చంద్ దర్శించుకున్నారు. ఏర్పాట్లను దేవస్థానం ఏఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఏపిఆర్ఓ రవి పర్యవేక్షించారు.

## విద్యార్థులకు వాటర్‌బాటిళ్ళు పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబర్ 1 ప్రభాతవార్త::రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం బుచ్చినాయుడుకండ్రిగ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల అధినేత చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి వాటర్ బాటిళ్ళు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి కె. రవీంద్రనాధ్, కల్లివెట్టుఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వాణి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర ఎండ నేపథ్యంలో పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధతో వాటర్‌బాటిళ్ళు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కూడా బాగా చదువుకొని ఉన్నత శిఖిరాలను సాధించాలన్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలైన ఎన్‌వి కండ్రిగ, నేర్పాకోట వైసి, కారణి హెచ్‌డబ్ల్యూ, నెలవాయి విద్యార్థులకు అందించారు. కార్యక్రమాల్లో ఎస్‌టియు అధ్యక్షులు రోసనూరు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శులు వై. గజేంద్రకుమార్, వెంకటేష్, శారదయ్య, పోలూరఉు జగన్నాధం, గౌరవ సలహాదారు జి. పార్థసారధి, వినోద్, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేలవేడు పోషణ మాసోత్సవం



శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని వేలవేడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం విలువ, సరైన సమయంలో ఆహారం తీసుకోవడం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై విస్తృత అవగాహన కల్పించారు. పిల్లల్లో పోషణ లోపం రాకుండా సమతుల్య ఆహారం అందించాలని, ముఖ్యంగా రాగి జావ, సోనా బియ్యం, బెల్లం వాడకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాంసాహారం అమ్మరాదు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త గాంధీజయంతిని పురస్కరించుకొని పట్టణంలో ఎక్కడా కూడా మాంసాహారం అమ్మరాదని మున్సిపల్ కమిషనర్ కెవి క్రిష్ణారెడ్డి తెలిపారు. ఎక్కడైనా మాంసాహారం, బార్స్ మరియు రెస్టారెంట్ నడుపుతున్నట్లు తెలిసినట్లైతే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## శ్రీకాళహస్తి డివైయస్‌పి గూడూరుకు బదిలి

శ్రీకాళహస్తి అక్టోబర్ 1 ప్రభాతవార్త శ్రీకాళహస్తి ఎస్‌డిపిఓగా సుమారు రెండు సంవత్సరాలకు పైగా పని చేస్తున్న ఎడిపిఓ కే. నరసింహామూర్తిని గూడూరుకు బదిలి చేస్తూ గురువారం ఉత్తర్వులు జారి అయ్యాయి. ఎస్‌డిపిఓగా ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాలలో శాంతి భద్రతల నిర్వహణలో చక్కగా నిర్వహించారు.అయితే గత ఆరునెలలుగా శ్రీకాళహస్తిలో శాంతి భద్రతలపై పట్టుతప్పింది.అంతేకాక యువత దారి తప్పారు.దాడులు పెరిగాయి.గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగాయి.పోలీసుల మీద యువత భయం లేకుండా వ్యవహారించటంతో పాలకులు విమర్శలు ఎదుర్కొక తప్పలేదు. దాంతో డివైయస్‌పికి బదిలి తప్పలేదు.అయితే ఆయన స్థానంలో ఎవ్వరిని నియమించలేదు.

## జిల్లా టైలర్స్ కార్యదర్శికి సత్కారం




శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా టౌలర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాళహస్తి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు షేక్ చాన్‌బాషాను గురువారం జిల్లా సంఘం ప్రతినిధులు సత్కరిం చారు. ఆయనకు 68 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన జీవితంలో అధిక భాగం దర్జీల సామాజిక సేవలో గడిపారని అలాంటి సామాజిక సేవకుని సేవలు ఎంతో అవసరమని విరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని టైలర్స్ సమస్యల పరిష్కారానికి ఆయన స్పందించిన తీరు అభినందనీయం. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి మాజీ అధ్యక్షుడు శ్రీను,సుబ్రమణ్యం,సుబ్బరాయులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆశోక్, జిల్లా ప్రచార కార్యదర్శి సయ్యద్‌జఫురుల్లా, కోశాధికారి ఉమాపతి,నగరి వీరయ్య, రాజేంద్ర, హమీద్, రాజు,మహమ్మద్ రఫీ, రాజా, సెల్వా, నాగ,సృజన, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో ఇంటింటికి ఫించన్లు పంపిణీ



ఏర్పేడు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: పేదల సేవలో ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏర్పేడు మండలం సీతారాంపేట గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా ఫించన్లను ఇంటింటికెళ్ళి పంపిణి చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి పార్టీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్దిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగరాజనాయుడు, సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి,కృష్ణవేణి, పొన్నారావు, రాఘవవేంద్ర, సుబ్రమణ్యం, గుణయాదవ్,రమణ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న వైసీపీ : గురువారెడ్డి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త: రాష్ట్రంలో బీసీలకు 34 స్థానిక సంస్థల రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో 105, 1065 ను అడ్డుకునేందుకు వైసీపీ కోర్టుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రెడ్డివారి గురువారెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ బీసీలకు 34 రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, ప్రభుత్వం ప్రత్యేకంగా చర్చించి జీవోలు జారీ చేస్తే వైసీపీ నేతలు అడ్డుకోవడం బీసీలకు రాజ్యాధికారం దూరం చేయడమేనని అన్నారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ న్యాయ నిపుణులతో సంప్రదించి సుప్రీంకోర్టులో కేసు వేసి రిజర్వేషన్ సాధిస్తామని సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని స్వాగతిస్తున్నామన్నారు.

## కుప్పయ్య కండ్రిగ పాఠశాలకు విద్యాసామగ్రి



ఏర్పేడు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం కుప్పయ్య కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు జయకుమార్ విజ్ఞప్తి మేరకు పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సరిపడా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు తదితర స్టేషనరీని ఉచితంగా అందజేశారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఏడాదికి సరిపడా సామగ్రి అందించిన డాక్టర్ కోటేశ్వరబాబును పాఠశాల ఎస్ఎంసీ చైర్ పర్సన్ తేజశ్రీ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయకుమార్, ఎస్ఎంసీ చైర్ పర్సన్ తేజశ్రీ, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారుల్లో ఆనందం



తొట్టంబేడు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం తొట్టంబేడు గ్రామంలో గురువారం ఉత్సాహంగా సాగింది. తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీమండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం (మణి) ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి పెన్షన్ సొమ్మును అందజేశారు.గత ప్రభుత్వంలో పెన్షన్ల కోసం లబ్ధిదారులు పడిన ఇబ్బందులు ఇప్పుడు లేవని, ఉదయాన్నే వారి ఇంటికే వెళ్లి పెన్షన్ అందజేయడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ కో కన్వీనర్ భార్గవ కుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీరుస్తున్న పేట బ్రదర్స్



శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమతి దొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం 94వ వారానికి చేరుకుంది. గురువారం నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో బస్టాండ్ పరిసరాల్లోని పేదలు, ప్రయాణికులు, ఆటో కార్మికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, మనీ, చల్లా హరి, ఆరిఫ్, నవీన్, రమేష్ బాబు, చందు, లక్ష్మీపతి, రాజా, వీర మహిళలు పేట శారద, నారాయణ గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై వైసీపీ గొడ్డలి పోటు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త: అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా పని చేయడమే లక్ష్యంగా పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం సాగిస్తున్నారని, వెనుకబడిన తరగతులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కల్పించిన 34 బీసీ రిజర్వేషన్లపై వైసీపీ చేత గొడ్డలిపోటు వేయించారని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిఎం.ఉమేష్ రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. గురువారం శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం టీడీపీ స్థానిక సంస్థల్లో 34 రిజర్వేషన్ కల్పిస్తూ జీవో నెం.105 మరియు 1065 జారీ చేయడం చారిత్రాత్మకమన్నారు. దీనివల్ల బీసీలు మోసే స్థాయి నుండి కూర్చునే స్థాయికి ఎదుగుతారన్నారు. బీసీ నాయకత్వాల ఎదుగుదలను ఓర్చుకోలేని జగన్ రెడ్డి తన మనుషుల చేత కోర్టులో కేసు వేయించి రిజర్వేషన్లను రద్దు చేయించడం దుర్మార్గమని మండిపడ్డారు. బీసీల పక్షపాతి అయిన సీఎం చంద్రబాబు నాయకత్వంలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించి 34 రిజర్వేషన్లను కాపాడుతామని తెలిపారు. ఈ సమావేశంలో జి.దశరథాచారి,మిన్నల్ రవి, బీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి, కయ్యూరి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల మోములో చిరునవ్వులే లక్ష్యం

### - తుమ్మలగుంటలో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ




తిరుపతి రూరల్, అక్టోబర్ 1 ప్రభాత వార్త: పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తుడా ఛైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంట పంచాయతీ పరిధిలోని ఎల్.ఎస్. నగర్‌లో గురువారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోస్తా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించిన ఆయన, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. పింఛన్ పంపిణీ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో ఆప్యాయంగా ముచ్చటించిన డా. దివాకర్ రెడ్డి వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన విధానంపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ ప్రముఖులు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే పలు ప్రారంభోత్సవాలు



విజయపురం, అక్టోబరు 1 ప్రభాత వార్త: విజయపురం మండలంలో గురువారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పలు ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఇందులో భాగంగా కోసల నగరంలో నూతనంగా 32 లక్షలతో నిర్మించిన విలేజీ హెల్త్ క్లినిక్ భవనం, పాత ఆర్కాడు గ్రామంలో 43 లక్షలతో కొత్తగా నిర్మించిన పంచాయతీ కార్యాలయం భవనం, 89 లక్షలజాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. పాత ఆర్కాడు గ్రామంలో 43 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గత రెండేళ్ళలో సుమారు 50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగరి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి అనుపమ, తహసీల్దార్ మునిశైలజ, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీడీ సునీల్‌కుమార్, డాక్టర్ విష్ణుప్రియ, మాజీ ఎంపీపీ లక్ష్మీపతిరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, చుక్కా ధనంజయ యాదవ్, స్థానిక నాయకులు మునిభాస్కర్ రాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, డి.సుధాకర్‌రాజు, దశరథ రాజు, డి.లోకేష్ రాజు, హరికృష్ణ, శేఖర్‌రాజు, బాలసుబ్రహ్మణ్యం, కొండూరు దాము, శివలింగం, నాగభూషణం యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలు : డీఎస్పీ

చిత్తూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: చిత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అక్టోబర్ 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకట నారాయణ తెలిపారు. ఈ మేరకు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు ఎవ్వరు నిర్వహించరాదని డీఎస్పీ స్పష్టం చేశారు. చిత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, టుటౌన్ పోలీస్ స్టేషన్, చిత్తూరు తాలుకా, జిడినెల్లూరు, ఎన్ఆర్ పేట, పెనుమూరు, యాదమరి, గుడిపాల, తవణంపల్లి, కాణిపాకం, పూతలపట్టు, ఐరాల, కల్లూరు, రొంపిచెర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో వుంటుందన్నారు. 30 పోలీసు యాక్ట్ ఉల్లంఘించి ఎవరైనా సభలు, సమావేశాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నేపాల్ వరదల్లో గల్లంతైన వారి గుర్తింపుకు...

## డిఎన్ఎ నమూనాల సేకరణ

చిత్తూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతైన వ్యక్తుల గుర్తింపుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిఎన్ఎ ప్రొఫైలింగ్ ద్వారా వారి కుటుంబ సభ్యులను గుర్తించే చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనలో గల్లంతైన వ్యక్తుల తండ్రి, తల్లి, కుమారుడు, కుమార్తె, సోదరుడు, సోదరి తదితర సన్నిహిత రక్త సంబంధీకుల నుండి జీవ సంబంధ నమునాలు సేకరించి డిఎన్ఎ ప్రొఫైలింగ్ నిర్వహించనున్నారన్నారు. ఈ మేరకు సిఎఫ్ఎస్ఎల్, ఎన్ఎఫ్ఎస్‌యు ప్రయోగశాలల సమన్వయంతో కుటుంబ సభ్యుల డిఎన్ఎ రిఫరెన్స్ నమూనాల సేకరణ, డిఎన్ఎ ప్రొఫైలింగ్‌ను సులభతరం చేయడానికి రాష్ట్రంలోని ఫోరెన్సిక్ సైన్స్ లేబోరేటరీలను కోరడం జరిగింద న్నారు. డిఎన్ఎ నమూనాల సేకరణ, ప్రొఫైలింగ్ సేవలు పూర్తిగా ఉచితంగా అందించబడుతాయన్నారు. నేపాల్‌లో ఇటీవల సంభవించిన వరదల్లో తమ కుటుంబ సభ్యులు గల్లంతైనట్లు భావిస్తున్న వారు లేదా వారి ఆచూకీ తెలియని కుటుంబ సభ్యుల గుర్తింపుకు డిఎన్ఎ నమూనాలను అందించాల్సిన వారు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ జాయింట్ డైరెక్టర్, నోడల్ అధికారి వనజాక్షిని సంప్రదించాలన్నారు. అలాగే డిఎన్ఎ నమూనాలను అందించాల్సిన వారు 97045 35092 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## 600 గ్రాముల గంజాయి పట్టివేత



చిత్తూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని మురకంబట్టు వద్ద బుధవారం రాత్రి తాలుకా ఇన్స్‌పెక్టర్ రామచంద్ర పర్యవేక్షణలో ఎస్ఐ వి.అశోక్‌కుమార్, సిబ్బంది 600 గ్రాముల గంజాయి పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాలుకా ఇన్స్‌పెక్టర్ రామచంద్ర వెల్లడించిన వివరాల మేరకు ఎస్ఐ వి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో తాలుకా పోలీసులు బుధవారం రాత్రి మురకంబట్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్కడ అనుమానస్పదంగా తిరుగుతున్న తమిళనాడు వేలూరుకు చెందిన జయకుమార్, మహ్మద్ ఆలీలను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారి వద్ద 600 గ్రాముల గంజాయి పట్టుబడటంతో గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు తాలుకా స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయించడం, సరఫరా చేయడం, సేవించడం, అక్రమంగా మద్యం విక్రయించడం, పేకాట నిర్వహించడం లేదా ఆడటం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తాలుకా ఇన్స్‌పెక్టర్ రామచంద్ర హెచ్చరించారు. ప్రజలు గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, సేవనం, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే సత్వరం డయల్ 112కు సమాచారం అందించాలని తాలుకా ఇన్స్‌పెక్టర్ రామచంద్ర కోరారు.